ప్రజాశక్తి

శుక్రవారం 24 నవంబర్ 2023

5

అల్లూరి సీతారామరాజు

రైతు భరోసా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-పెదబయలు: మండలంలోని సీకారి పంచాయతీ సచివాలయం పరిధిలో రైతు భరోసా కేంద్రాన్ని ఎంఎల్ఏ పాల్గుణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు అనువైన పథకాలు అందించేందుకు రైతు భరోసా కేంద్రం ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గులేల్లి. కృష్ణారావు, ఎంపీటీసీ సభ్యులు వంతాల ఆనందరావు, ఎంపీపీ బోండా వరహాలమ్మ, జడ్పీటీసీ సభ్యులు కూడా బోంజుబాబు, ఆగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ వనాలభ. సన్యాసి, వైస్ ఎంపీపీ కొర్రా. రాజుబాబు, మండల పోలింగ్ బూత్ కన్వీనర్ కొర్రా కనకరాజు, మండల జెసిస్ కన్వీనర్ గంపరాయి అజయ్ కుమార్, సర్పంచ్ రూడా. మత్యలింగం, మండల అగ్రికల్చర్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఫాల్గుణ

వేతనాలకు పోరుబాట

- ఆశా వర్కర్లుగా గుర్తించాలని డిమాండ్
-నేటి నుంచి ఐటిడిఎ వద్ద సిహెచ్‌డబ్ల్యుల రిలే దీక్షలు

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు ఏజెన్సీలో పలు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉన్న మారుమూల గ్రామాల్లో ప్రజలకు సుదీర్ఘకాలం నుంచి ఆరోగ్య సేవలు అందిస్తున్న తమకు వేతనాలు చెల్లింపుల్లో అన్యాయం జరుగుతోందని సామాజిక ఆరోగ్య కార్యకర్తలు (సిహెచ్ డబ్ల్యులు) ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆశా వర్కర్లకు కేంద్ర ప్రభుత్వం ద్వారా నెలకు పదివేల రూపాయలు వేతన మందుతోందని, ఆశాల మాదిరిగానే గ్రామాల్లో విధులు నిర్వర్తిస్తున్న తమకు ఐటీడీఏ కేవలం నెలకు 4000 రూపాయలు మాత్రమే చెల్లిస్తుందని, సమాన పనికి సమాన వేతనం పొందలేకపోతున్నామని సిహెచ్‌బ్ల్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను ఆశా వర్కర్లుగా గుర్తించాలని సిహెచ్‌డబ్ల్యులు గత కొన్నేళ్లుగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఈ నెల 24న శుక్రవారం పాడేరు ఐటిడిఏ ఎదుట తమను ఆశా వర్కర్లుగా మార్పు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో సిహెచ్ డబ్ల్యులు రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నారు. పాడేరు ఏజెన్సీ వ్యాప్తంగా సుమారు 750 మంది సిహెచ్‌డబ్ల్యులు పని చేస్తున్నారు. మారుమూల గ్రామాలలో గత 7 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న వీరంతా విధులు నిర్వహిస్తున్నారు. గ్రామంలో అన్ని రకాల వైద్య సేవలు అందిస్తూ గర్భిణీ, బాలింతలను ఆసుపత్రికి తనిఖీలకు, కాన్పులకు తీసుకు వెళుతున్నారు. సొంత ఖర్చులతో సెల్ఫోన్, యూనిఫాం కొనుక్కొని పిహెచ్సి పరిధిలో వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. తమకు రాయితీలు కల్పిస్తూ, సమాన పనికి సమాన

ఆందోళన చేస్తున్న సిహెచ్‌డబ్ల్యులుఉ (ఫైల్ పొటొ)

వేతనం ఇవ్వాలని ఆశా వర్కర్లుగా మార్చాలని ఇప్పటికే జిల్లా అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులకు ఎన్నోసార్లు విన్నవించారు. అయినా సిహెచ్ డబ్ల్యూ ల సమస్యలు పరిష్కారం కాలేదు.

ఏజెన్సీలో మొత్తం ఆశా వర్కర్ల పోస్టులు 53 ఖాళీలున్నాయి. వీటిని సిహెచ్డబ్ల్యులతో భర్తీ చేయాలని కోరుతున్నారు. మిగిలిన సిహెచ్ డబ్బులు అందర్నీ ఆశా కార్యకర్తలుగా మార్చాలని లేదా ఆశ కార్యకర్తలకు ఇస్తున్న మాదిరిగానే తమకు కూడా నెలకు రూ.10,000 వేతనం ఇవ్వాలని కోరుతున్నారు.

ఆశ కార్యకర్తలుగా గుర్తించాలి

గత 15 సంవత్సరాలుగా గ్రామాల్లో వైద్య సేవలు అందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు అతి తక్కువ వేతనం నాలుగు వేలు ఇస్తున్నారు.. తక్కువ వేతనాలతో సిహెచ్‌డబ్ల్యూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.అధికారులు చొరవ తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి ఆశాలుగా మార్చాలని విజ్ఞప్తి చేశారు. ఇచ్చే కొద్దిపాటి వేతనాలు నెల నెల రాలేదని ఐటీడీఏ పిఓ స్పందించి వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ కి ఆశలుగా మార్చాలని మరోసారి ప్రతిపాదించాలని కోరారు.

బోనంగి చిన్నయ్య పడాల్
గౌరవ అధ్యక్షులు
ఆశ /సిహెచ్ డబ్ల్యు ల సంఘం

ఏజెన్సీలో ఉద్యోగాలను గిరిజనులతోనే భర్తీ చేయాలి

-గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-పాడేరు:ఏజెన్సీ ప్రాంతంలో స్థానిక ఆదివాసి యువతతోనే ఉద్యోగాలు భర్తీ చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్కు వినతి పత్రం సమర్పించారు. విశాఖపట్నంలోని గిరిజన సాంస్కృతిక పరిశోధన మిషన్ కార్యాలయంలో గురువారం గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ జె.వెంకట మురళిని ఆదివాసీ గిరిజన సంఘం ప్రతినిధి బృందం కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా .అప్పలనర్స మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో 100శాతం ఉద్యోగ రిజర్వేషన్ జీవో 3 ని సుప్రీంకోర్టు రద్దు చేసినప్పటికీ ఐదో షెడ్యూల్ స్ఫూర్తి ప్రకారం ఏజెన్సీ ప్రాంతంలో గిరిజ నేతరులకు ఉద్యోగాల పేరుతో వలసలను ప్రోత్సహించడం గిరిజన హక్కులు, చట్టాలను ఉల్లంఘించడమేనని తెలిపారు.గురుకులం, ఏకలవ్య పాఠశాలతో పాటు ఇటీవల కాలంలో ఐసిడిఎస్ డిపార్ట్మెంట్లో భర్తీకి ప్రకటించిన 22 ఉద్యోగాలలో స్థానిక ఆదివాసులకు ఒక్క పోస్టు కూడా కేటాయించ లేదని తెలిపారు. గిరిజన సలహా మండలి తీర్మానం ప్రకారం ఐదో షెడ్యూల్ క్లాస్ టు ద్వారా ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ యువతకు 100 శాతం రిజర్వేషన్ కల్పించడానికి చట్టబద్ధత ఇవ్వచ్చునని అన్నారు. వందలాది మంది ఆదివాసీ డీఎస్సీ అభ్యర్థులు ఉద్యోగ అవకాశాల కోసం ఎదురు చూస్తున్నారని ప్రత్యేక గిరిజన డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ మాతృ భాష బోధిస్తున్న నేటివ్ స్పీకర్స్ భాష (వాలంటీర్లకు) తక్షణమే టైం స్కేల్ జీతాలు చెల్లించాలని ఆయన డైరెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. ఆదివాసీ మాతృభాష నేటివ్ స్పీకర్స్ కు నెలకు 5000 రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఏజెన్సీలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఉల్లంఘన విషయాన్ని గమనంలో పెట్టుకొని అన్ని శాఖలకు కచ్చితంగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేస్తామని డైరెక్టర్ తెలిపారని అప్పలనర్స తెలిపారు. నూరు శాతం రిజర్వేషన్ పై సుప్రీం కోర్టు లో పెండింగ్ ఉందని, ప్రభుత్వం నిర్ణయం బట్టి ముందుకు వెళ్తామని పేర్కొన్నారన్నారు. ఆదివాసీ నేటివ్ స్పీకర్స్ వేతనాలు పెంచడానికి సుముఖతను వ్యక్తం చేశారన్నారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి నేటివ్ స్పీకర్స్ రాష్ట్ర నాయకులు కొర్ర సర్బునాయుడు, సతీష్, చంద్రయ్య వీరయ్య, కుమారి, గౌరీ, ఐశ్వర్య, కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న అప్పలనర్స

వర్షంలో గొడుగు వేసుకొని డోలీ మోతతో గర్భిణిని తీసుకొస్తున్న గిరిజనులు

తప్పని డోలీ మోతలు

గర్భిణీని నాలుగు కిలోమీటర్లు మోసుకొచ్చిన కొత్తపల్లి గిరిజనులు

ప్రజాశక్తి -కొయ్యూరు

తరాలు మారినా, ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా, పాలకులు మారుతున్నా గిరిజనుల తలరాతలు మాత్రం మారడం లేదు. వారు నివసించే గ్రామాలకు రహదారి వంటి కనీస మౌలిక సదుపాయం కూడా కల్పించడం లేదు. రోగులను, గర్భిణులను ఆసుపత్రికి తరలించాలంటే నేటికీ డోలీ మోతలు తప్పడం లేదు. మండలంలోని మారుమూల బూదరాళ్ల పంచాయితీ కొత్తపల్లి గ్రామానికి చెందిన గర్భిణి కొర్రా త్రిషకు బుధవారం సాయంత్రం పురిటి నొప్పులు వచ్చాయి. ప్రసవవేదనతో బాధపడుతున్న ఆమెను గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో కుటుంబీకులు, గ్రామస్తులు డోలీ కట్టి మోసుకుంటూ నాలుగు కిలోమీటర్లు దూరంలో ఉన్న చింతవానిపాలెం రహదారికి తీసుకొచ్చారు. అక్కడ నుండి ఆటోలో మండల కేంద్రంలోని రాజేంద్రపాలెం పిహెచ్‌సికి తరలించారు. తమ గ్రామానికి రోడ్డు సదుపాయం ఉంటే ఇటువంటి కష్టం ఉండేది కాదని గ్రామస్తులు కొర్రా త్రినాథ్, కొర్రా సుందర్రావు, కె.సత్తిబాబు, జి.శ్రీను, ఎం.నగేష్, కె.శ్రీను, బి.సింహాచలం, తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని వారు కోరారు.

గేట్లు మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఇఇ ప్రభాకర్

గేట్లు మరమ్మతులు నాణ్యతతో చేపట్టాలి

ప్రజాశక్తి -సీలేరు

గేట్లు మరమ్మతు పనులు నాణ్యత లోపాలు లేకుండా నిర్వహించాలని లక్ష్మీ ఎంటర్ప్రైజెస్ కాంట్రాక్టర్లను ఏపీ జెన్కో ఈఈ ప్రభాకర్ ఆదేశించారు. జీకే వీధి మండలం సీలేరు రెగ్యులేటరీ డ్యాం 1, 3, 6, గేట్లు రబ్బర్ సీల్స్ రోలర్స్ అరిగిపోవడం వలన గేట్లు అడుగుభాగం నుంచి లీకేజీ నీరు వృధాగా దిగు భాగానికి పోతుంది. దాన్ని అరికట్టేందుకు ఏపీ జెన్కో అధికారులు లక్ష్మీ ఎంటర్ప్రైజెస్ కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. నాలుగు నెలల క్రితమే నాలుగు ఐదు గేట్లు మరమ్మతు పనులు నిర్వహించగా తాజాగా ఒకటి, మూడు, ఆరు, గేట్లు పనులు ఏపీ జెన్కో ఈ ఈ ప్రభాకర్ ఎఈ సురేష్ పర్యవేక్షణలో శరవేగంగా జరుగుతున్నాయి. గేట్లు రబ్బర్ సీల్స్, రోలర్స్, పాత వాటిని తొలగించి వాటి స్థానంలో కొత్త వాటిని అమర్చుతున్నారు. మిగిలిన గేట్లకు త్వరలో ఎస్టిమేట్లు సిద్ధం చేసి మరమ్మతు పనులు పనులు నిర్వహిస్తామని ఈఈ ప్రభాకర్ తెలిపారు.

సత్యసాయి జయంతి వేడుకలు

ప్రజాశక్తి -సీలేరు

సత్యసాయిబాబా 98వ జయంతి వేడుకలు గురువారం జీకే వీధి మండలం సీలేరు ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వమించారు. ఉదయం నుంచే పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పేగా మాజీ సర్పంచ్ రంగయ్య మృతి

సిపిఎంకు తీరని లోటు : కిరణ్

ప్రజాశక్తి-చింతూరు

చింతూరు మండలం పేగా గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్, సిపిఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ కంగాల రంగయ్య అనారోగ్యంతో కొత్తగూడెం ఆసుపత్రిలో గురువారం మృతి చెందారు. రంగయ్య మృతదేహాన్ని స్వగ్రామం పేగాకు తీసుకొచ్చారు. సమాచారం తెలుసుకున్న సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పన కిరణ్, మండల కార్యదర్శి సీసం సురేష్, పలువురు సిపిఎం నాయకులు రంగయ్య ఇంటికి వెళ్లి ఆయన పార్థివ దేహంపై పార్టీ పతాకాన్ని ఉంచి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బొప్పన కిరణ్ మాట్లాడుతూ పేగ పంచాయతీ పరిధిలో కామ్రేడ్ రంగయ్య కుటుంబం తాతల కాలం నుండి సిపిఎంలో ఉంటూ ఈ ప్రాంత ప్రజల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు. పార్టీ నాయకుడిగా, పంచాయతీ సర్పంచ్‌గా ప్రజా సమస్యలను పరిష్కరించే దాంట్లో ముందుండేవాడని పేర్కొన్నారు. అమరజీవి కామ్రేడ్ శ్యామల వెంకటరెడ్డి, బత్తుల భీష్మారావు చూపిన బాటలో నడుస్తూ, ఎన్ని సమస్యలొచ్చినా, మావోయిస్టుల నుండి బెదిరింపులు ఎదురైనా పార్టీ ఆశయాన్ని ముందుకు తీసుకెళ్లడానికి విశేష కృషి చేశారని కొనియాడారు. రంగయ్య మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. రంగయ్య ఆశయ సాధన కోసం, ఐక్యంగా పార్టీని నిలబెట్టేందుకు ముందుకు రావాలని, అదే రంగయ్యకు మనమిచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో రంగయ్య కుటుంబ సభ్యులు కంగాల రమేష్, లక్ష్మి, సిపిఎం మండల కమిటీ సభ్యులు మల్లం సుబ్బమ్మ, ముట్టం రాజయ్య, కలం కన్నయ్య, కారం సుబ్బారావు, వీరబోయిన దిలీప్, గ్రామ శాఖ సభ్యులు ఉయ్యక, కన్నయ్య, మడకం, కన్నయ్య, సోడే మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రంగయ్య మృతదేహంపై సిపిఎం జెండా కప్పి నివాళులర్పిస్తున్న నేతలు

ధర్నా చేస్తున్న నాయకులు, రేషన్ కార్డుదారులు

ఉచిత బియ్యం పంపిణీలో జాప్యంపై
ఆదివాసి గిరిజన సంఘం ధర్నా

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:మండలంలోని సుంకరమెట్ట పంచాయతీ దండబాడు గ్రామంలో గిరిజనులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బియ్యం మూడు నెలల నుంచి 70 కుటుంబాలకు ఇవ్వలేదని ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో గురువారం రేషన్ కార్డుదారులు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుంకరమెట్ట సర్పంచ్ జి.చిన్నబాబు రామారావు మాట్లాడుతూ, సివిల్ సప్లై అధికారుల నిర్లక్ష్యం కారణంగా పేదలకు ప్రతినెలా గిరిజనులకు బియ్యం అందలేదన్నారు.స్పందించిన తహశీల్దార్ రెండు నెలలు బియ్యం ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సుబ్బారావు కె.దేవన్న వార్డు మెంబర్ సిహెచ్ చిన్న అంకుల్, పి.మొద్దు, పి కుమోన్, కె.రాంబాబు పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

కల్యాణమస్తు నిధులు జమ

ప్రజాశక్తి -పాడేరు: జిల్లాలో ఈ ఏడాది జూలై - సెప్టెంబరు త్రైమాసికంలో వివాహం చేసుకున్న 177 జంటలకు రూ.1 కోటి 76 లక్షల 30 వేల కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా ఆర్థిక సహాయాన్ని లబ్దిదారుల ఖాతాలకు ప్రభుత్వ జమ చేసింది. ఈ మేరకు గురువారం తాడేపల్లి ముఖ్య మంత్రిక్యాంపు కార్యాలయం నుండి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి వధువుల తల్లుల ఖాతాలకు ఆర్థిక సహాయం జమ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, పాడేరు శాసన సభ్యురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వెనుకబడిన తరగతులు (ఎ) సామాజిక వర్గానికి ఇద్దరకు రూ.1 లక్ష, బిసి (బి) వర్గానికి 5గురికి రూ.3 లక్షలు, బిసి (డి) నలుగురికి రూ.2 లక్షలు, ఎస్సీలు నలుగురుకి రూ.4 లక్షల 40 వేలు, 162 మంది ఎస్టీలకు రూ. 1 కోటి 66 లక్షల 60 వేలను ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం విడుదల చేసిందన్నారు.

పాడేరు శాసన సభ్యురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి పేదలకు మంచి చేయాలని సంకల్పంతో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. లబ్దిదారులు కళ్యాణమస్తు, షాదీ తోఫా ఆర్థిక సహాయాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.వధూవరులకు నమూనా చెక్కును పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు, డి ఆర్ డిఎ పిడి వి.మురళి, వెలుగు ఏపి ఎంలు, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని
మిడ్డేమీల్స్, శానిటేషన్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గంగవరం రాజవొమ్మంగి మండల కేంద్రాల్లోని ఎంఈఓ కార్యాలయాల వద్ద సిఐటియు ఆధ్వర్యాన మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, పాఠశాలల శానిటేషన్ కార్మికులు గురువారం ధర్నాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా అధ్యక్షులు ఎం.వాణిశ్రీ, గిరిజన సంఘం జిల్లా ఉపధ్యక్షులు పి.రామరాజు, ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికులు యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.శాంతిరాజు, నాయకులు సింహాచలం, అక్కమ్మ, సరస్వతి మాట్లాడారు. మధ్యాహ్నం భోజనం కార్మికులకు, శానిటేషన్ వర్కర్లకు శ్రమకు తగిన వేతనం ఇస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలకు నోచుకోలేదన్నారు. వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని, పెట్టుబడి బిల్లులు ఇవ్వాలని, ధరలకు అనుగుణంగా విద్యార్థికి మెస్ చార్జీలు రూ.20కు పెంచాలని, ప్రతి నెల 5వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, యూనిఫారం, వంటపాత్రలు ఇవ్వాలని, మిడ్డే మీల్స్ వర్కర్లకు కనీస వేతనం రూ.10వేలుకు పెంచాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలపై శాంతియుతంగా ఆందోళనలు చేస్తుంటే పోలీసుల ద్వారా నిర్బంధాలు ప్రయోగించి కార్మికుల పట్ల ప్రభుత్వం కక్షపూరితంగా వహిస్తుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకోవడానికి ఐక్యంగా పోరాడటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంఈఓ సురారెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మిడ్డే మీల్స్ వర్కర్ల యూనియన్ నాయకులు కుమారి, సీత, ఎం చిన్ని, ఎన్ నాగమణి, బి గంగ, వీరయ్యమ్మ, ఎం రెడ్డమ్మ, బి పండమ్మ, వి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న మిడ్డేమీల్స్, శానిటేషన్ కార్మికులు

వర్షానికి తడిసి మొలకొచ్చిన వరి పంట

ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వేడుకోలు

ప్రజాశక్తి -సీలేరు

ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిపోయిన వరి పంట పొలాల్లోనే మొలకలొస్తున్నాయి. తీవ్ర వర్షాభావం కారణంగా చాలా ప్రాంతాల్లో వరి పంట ఎండిపోగా, జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ పరిధి గొర్రెలోవ, చింత గుప్పు తదితర గ్రామాల్లోని నీటి వనరులు ఉన్న పొలాల్లో వరి కొద్ది మేరకు పండింది. రైతులు ఎంతో ఆనందంగా కోతలు కోశారు. ఇంతలోనే అకాలంగా వర్షం కురవడంతో పొలాల్లో ఉన్న వరి పంట తడిసి ముద్దయింది. పంటను తెచ్చుకుందామని రైతులు పొలానికి వెళ్లగా, పంట మొత్తం మొలకలొస్తున్నాయి. చేతికొచ్చిన పంట నేలపాలు కావడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఏడాది పొడుగునా తిండిగింజలకు సరిపోతాయని ఆశించామని, అకాల వర్షం మా ఆశలను అడియాశలు చేసిందని గొర్రెలోవ గ్రామానికి చెందిన గిరిజన రైతు రాజు పేర్కొన్నారు. ఈ ఏడాది తిండిగింజలకు కూడా తమ కుటుంబాలు ఇబ్బంది పడాల్సి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే గిరిజన రైతులను ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలని ఆయన కోరారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను అధికారులు సందర్శించి పంట నష్టాన్ని అంచనా వేసి ఆర్థికంగా ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

తడిసిన వరి పంటను చూపుతున్న రైతులు

నేడు 4 మండలాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి-రంపచోడవరం

జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా శుక్రవారం గంగవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి, వై.రామవరం మండలాల్లోని పలు గ్రామాలకు ఉదయం 10 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇఇ ఎమ్.డి.యూసఫ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అధికారులతో మాట్లాడుతున్న గంగరాజు

గిరిజనుల భూములకు రక్షణ కల్పించాలి

జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని బీంపోలు పంచాయతీ సిమిడిపల్లి గ్రామంలో గిరిజనుల సాగు గ్రామకంఠం భూములు అన్యక్రాంతం పై మండలంలో నిర్వహించిన జగనన్న చెబుదాం కార్యక్రమంలో లిఖితపూర్వకంగా ఫిర్యాదు మేరకు రెవెన్యూ జిల్లా సర్వేయర్ వై మోహన్ రావు,రెవెన్యూ ఫారెస్ట్ అధికారులు జాయింట్ సర్వేలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ దీసరి గంగరాజు మాట్లాడుతూ, సిమిడిపల్లి గ్రామం తాతముత్తాతల కాలం నుండి గ్రామస్తులు అదే స్థలంలో వ్యవసాయం చేసుకుంటున్నారని, రియాల్ ఎస్టేట్ భూస్వాముల మాఫియా దిగి చుట్టూ ప్రక్కల భూములు కొనుగోలుతో పాటు సిమిడిపల్లి గ్రామం కూడా వారిదేనని భయభ్రాంతులకు గురి చేసి నిర్బంధంలో పెట్టి పోలీసులతో కేసులు పెడుతుందన్నారు.ఈ విషయంపై అనంతగిరిలో జరిగిన జగనన్నకు చెబుదాం స్పందనలో పిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు ఫారెస్ట్ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించారన్నారు.జిల్లా స్థాయి నుండి రికార్డులు రప్పించి మరల జాయింట్ సర్వే నిర్వహిస్తామని అధికారులు వెల్లడించారని అన్నారు. అధికారులు పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి గిరిజన గ్రామాన్ని రక్షణ కల్పించాలని భూస్వాముల ఆగడాలను అరికట్టి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి ఎట్రాసిటి కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టోకురు సర్పంచ్ కిల్లో మోస్య,సిపిఎం నాయకులు జ్యేష్ట వెంకటరమణ,రెవెన్యూ అధికారులు మండల సర్వేయర్ తేజేశ్వరరావు, బాలకష్ణ , ఫారెస్ట్ అధికారులు, బీట్ అధికారి సురేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్యకుమారి

నాడు- నేడుకు నిధుల మంజూరు

ప్రజాశక్తి- పెదబయలు : స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం అంగన్వాడీ కార్యర్తలకు, అభివృద్ధి కమిటీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పీడీ సూర్యకుమారి మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాలకు నాడు నేడు నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అంగన్వాడీ కేంద్రాలల్లో మౌలిక సదుపాయల కల్పనకు కమిటీల ఆధ్వర్యంలో ఖర్చు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారిని హెచ్ సంతోషిని, స్థానిక ప్రాజెక్ట్ అధికారిని రాజేశ్వరి, మండల విద్యాశాఖధికారి కొమ్ము కృష్ణమూర్తి, సూపరింటెండెంట్ మూర్తి పాల్గొన్నారు

గంధ ద్రవ్య పంటల పై శిక్షణ

ప్రజాశక్తి-అరకులోయ: జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు స్పైసెస్ బోర్డు ఆధ్వర్యం లో వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులకు మిరియాలు, పసుపు, అల్లం, దాల్చినచెక్క, ఇతర సుగంధ ద్రవ్య పంటలపై అరకు గిరిజన భవన్ లో గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శిక్షణలో భాగంగా వ్యవసాయ పద్ధతులు, పంటక ముందు వినియోగించే సాంకేతిక పద్ధతులు, సుగంధ ద్రవ్యాల నాణ్యత మెరుగుదల పద్ధతులు, గ్రేడింగ్, క్షేత్ర స్థాయిలో సమస్యల పరిష్కారం తదితర అంశాలపై శిక్షణను ఇచ్చారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.బి.ఎస్.నంద్, స్పైసెస్ బోర్డ సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ బి.కళ్యాణి, చింతపల్లి ఉద్యాన పరిశోధన కేంద్రం సైంటిస్ట్ వి.శివ కుమార్, డి ఎ ఎ టి సి సైంటిస్ట్ వెంకటరావు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన, సచివాలయ శాఖల సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

నకిలీ కుల ధ్రువీకరణ పత్రం జారీ చేసిన...

తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

ఆదివాసీ గిరిజన సంఘం రిలే నిరాహారదీక్ష

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: గిరిజనేతరులకు నకిలీ కుల ధ్రువీకరణ పత్రం జారీ చేసిన మండల తహశీల్దార్, రెవెన్యూ సిబ్బంది పై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ డిమాండ్ చేశారు. గురువారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం పక్కన ఆదివాసీ గిరిజన సంఘం మండల అద్యక్షుడు జి.బుజ్జిబాబు అధ్యక్షతన 30 గంటల నిరసన రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఈ దీక్షను ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్, సుంకరమెట్ట సర్పంచ్ చిన్నబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్, పిఒ అధికారులకు లిఖితపూర్వకంగా పిర్యాదు చేయడం జరిగిందని, దీనిపై సమగ్ర విచారణ జరిపి బహిర్గతం చేయాలన్నారు.మండలంలోని పెదలబుడు పద్మపురం, సుంకరమెట్ట పంచాయితీ పరిధిలో జారీ చేసిన నకిలీ కుల ధ్రువీకరణ పత్రం రద్దు చేయాలని గత మూడు నెలల నుండి పోరాటం చేయడంతో విఆర్ఓ, డిప్యూటీ తహశీల్దార్ కు సస్పెండ్ చేశారని, నకిలి కుల ధ్రువీకరణ పత్రం జారీ ముఖ్య సూత్రదారుడైన మండల తహశీల్దార్ పై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కింది స్థాయి అధికారులకు చెప్పవలసిన మండల తహశీల్దార్ నకిలీ కుల ధ్రువీకరణ పత్రం జారీ చేశారని చెప్పారు.బంగ్లావలస గ్రామ గిరిజనులు నకిలీ కుల ధ్రువీకరణ బయట తీస్తే గిరిజనులపై అక్రమ కేసులు పెట్టారని ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.పిటాల, కార్తికో, భగత్, నూకదొర పేరుతో కుల ధ్రువీకరణ పత్రం జారీ చేశారన్నారు.ఏజెన్సీలో ఈ ఇంటి పేరు గల వారు ఎక్కడా లేరన్నారు.అరకులోయ ప్రాంతాల్లో నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకుని నకిలీ గిరిజనులుగా చెలామణి అవుతూ ఉద్యోగాలు చేస్తున్నారని చెప్పారు.ఈ విషయమై ఆదివాసి ప్రజా ప్రతినిధులు ఎందుకు స్పందించ లేదని ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలోఆదివాసి గిరిజన సంఘం నాయకులు కె.జగన్నాథం, పి.నానిబబు, కె బుజ్జిబాబు, కె.అప్పన్న, జి.సత్యారావు, కె.చిట్టిబాబు, గిరిజనులు పాల్గొన్నారు.

దీక్షలను ప్రారంభిస్తున్న బాలదేవ్

పర్యాటకులను ఆకర్షించాలి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: అద్భుతమైన ప్రకృతి దశ్యాలు మన జిల్లాకే స్వంతమని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పష్టం చేసారు. గురువారం కలక్టర్ చాంబర్‌లో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో అరకు, లంబసింగి అందాలకు సంబంధించి నిర్వహించనున్న ట్యాగ్ లైన్ లోగో, ఫోటో ఫోటీల గోడ పత్రికలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అరకు-లంబసింగి వారసత్వం, అద్భుతమైన దశ్యాలు ప్రస్ఫుటించే విధంగా, పర్యాటకులను ఆకర్షించే విధంగా లోగో, ట్యాగ్ లైన్ తయారు చేసి ఫోటీలకు పంపాలని తెలిపారు. సజనాత్మక వ్యక్తులు ఈ పోటీలో పాల్గొని లోగో ట్యాగ్ లైన్ సారాంశాన్ని క్లుప్తంగా వివరించాలన్నారు. ఫోటీలో పాల్గొనేవారు అరకు-లంబసింగి, సాంస్కతిక వారసత్వం, సాదర ఆతిథ్యం సహజత్వం ప్రతిబింబించే లోగో, ట్యాగ్‌లైన్‌ని రూపొందించాలని కోరారు. ఫోటీలో పాల్గొనేవారు ఒక లోగో డిజైన్ ఒక ట్యాగ్‌లైన్‌ని మాత్రమే సమర్పించాలని సూచించారు.పిడిఎఫ్‌లో అరకు లంబసింగి జిమెయిల్ అడ్రస్ కు డిసెంబర్ 25 లోగా ఇమెయిల్ ద్వారా పంపాలని కలెక్టర్ వివరించారు. విజేతలకు ఇమెయిల్ ద్వారా తెలియజేయడమే కాకుండా ఫలితాలను అరకు టూరిజం వెబ్‌సైట్ లో కూడా ప్రకటిస్తామన్నారు. ఫోటోగ్రఫి ఫోటీలలో పాల్గొనేవారు గరిష్టంగా ఐదు ఫోటోగ్రాఫ్‌లను సమర్పించవచ్చని, ఫోటోలు తప్పనిసరిగా డిజిటల్ ఫార్మేట్ లో లేదా మించకూడదన్నారు. నాణ్యత కోసం అధిక-రిజల్యూషన్ చిత్రాలకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. ఫోటోగ్రాఫ్‌లను 2024 జనవరి నాలుగవ తేదీ లో ఇమెయిల్ ద్వారా పంపాలన్నారు. ఫోటీలో పాల్గొనదలచిన జిల్లాయేతరులు చైర్మన్ జిల్లా పర్యాటక మండలి, ఏ ఎస్ ఆర్ జిల్లా అకౌంట్ నెంబర్ - 329202010047969 కు రూ.500 లు నిర్ణీత పీజు చెల్లించాలన్నారు.ఈ ఫోటీలో గెలుపొందిన మొదటి బహుమతి రూ. 25 వేలు, రెండవ బహుమతి రూ.15 వేలు, మూడవ బహుమతి రూ.10 వేలు అందించటం జరుగుతుందని తెలిపారు.పది మందికి ప్రశంసా పత్రాలు అందిస్తామని వివరించారు. మరిన్ని వివరాలకు ఐటిడిఏ టూరిజం వెబ్ సైట్ ను సందర్శించాలని తెలిపారు. ఈ కార్యక్రమలో స్వదేశ్ దర్శన్ 2.0 ప్రాజెక్ట్ కన్సల్టెంట్ డి.హరిహర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయిని అరికట్టాలి : ఎస్ఐ సతీష్

ప్రజాశక్తి -హుకుంపేట: గంజాయి నిర్మూలనకు గ్రామ సర్పంచులు సహకారం అందించాలని స్థానిక ఎస్ఐ పి.సతీష్ కోరారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద గురువారం మండలంలోని సర్పంచులకు అవగాహన కల్పించారు. యువతీ యువకులు గంజాయి మత్తు పదార్థాల నుంచి దూరం చేయడానికి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కృషి చేస్తోందన్నారు. రైతులకు నిమ్మ, జామ, కాఫీ సిల్వర్ వంటి మొక్కలు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. గంజాయి రవాణా చట్టరీత్యా నేరమని తెలిపారు.

మాట్లాడుతున్న సుభద్ర

అభివృద్ధి పనులు చూసి మాట్లాడాలి : జెడ్‌పి చైర్‌పర్సన్ సుభద్ర

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: తెలుగుదేశం పార్టీ నాయకులు వైసీపీ ప్రభుత్వము చేపడుతున్న అభివద్ధి పనులను చూసి మాట్లాడాలని జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర తెలిపారు. గురువారం మండల పరిధిలోగల దోడిపుట్ బీడీ చంప 8.55కోట్ల రూపాయల నిధులతో మంజూరైన రహదారి పనులు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు గిరిజన ప్రాంతంలో మౌలిక సదుపాయాల కల్పనకు ఆ పార్టీ నాయకులు చేసింది ఏమీ లేదని ఆమె గుర్తు చేశారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఉన్నప్పుడు ఎక్కడ వేసిన గొంగళి అక్కడ ఉన్న చందగా మారిందని ఆమె అన్నారు.వైసిపి ప్రభుత్వం హయాంలో గిరిజన ప్రాంతం అభివృద్ధి బాట పట్టిందని ఆమె పేర్కొన్నారు. ప్రతి గ్రామానికి కనెక్టివిటీ ఉండేలా రహదారి సౌకర్యం కల్పించే విధంగా రోడ్లు మంజూరు చేస్తున్నామన్నారు.

ముంచింగిపుట్టు: మండలంలో రూ.8.55 కోట్లతో నిర్మాణం చేపట్టనున్న బీటీ రోడ్డు పనులకు ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సుభద్ర గురువారం శంకుస్థాపన చేశారు. బుంగాపుట్ నుంచి పులిజల్మ వరకు రూ.5.20 కోట్లతోనూ, దోడుపుట్ బీటీ రోడ్డు నుండి బీటి చంప వరకు రూ3.20 కోట్లు, పనసపుట్‌లో రూ.15 లక్షల తోనూ మట్టి రోడ్డు నిర్మాణ పనులకు సుభద్ర శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గిరిజన ప్రాంతంలో మౌలిక వసతుల కల్పనకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు. ప్రతి పంచాయతీలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్ నెస్ సెంటర్ నిర్మాణాలు శరవేగంగా జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నేత జగబంధు, వైసీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జున, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

కమిటీ జాబితాను ఇస్తున్న సభ్యులు

ఉత్సవ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలో సుజనకోట పంచాయతీ పాతసుజనకోట గ్రామంలో వచ్చే ఏడాది నిర్వహించే గంగమ్మతల్లి అమ్మవారి పండుగ మహోత్సవాలను పురస్కరించుకుని నూతన ఆలయ ఉత్సవ కమిటీ ఎన్నికలు కమిటీ చైర్మన్ నర్సమ్మ ఆధ్వర్యంలో గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులుగా వి.రమేష్, సలహాదారులుగా బి.బి.దామోదరం, అధ్యక్షులుగా సమరెడ్డి శంకర్రావు, ప్రధాన కార్యదర్శిగా వి.నీలకంఠం, కోశాధికారిగా జి.మదన్మోహన్, ఉపాధ్యక్షులుగా కె.సూర్యనారాయణ, ఎం.ప్రభాకర్ రావు, వి.నానిబాబు, సంయుక్త కార్యదర్శిలుగా ఎస్.దేవేంద్రుడు,వి.రామకృష్ణ, కార్యనిర్వహణ కార్యదర్శిలుగా ఎ.కోటీశ్వరరావు, సిహెచ్ మాణిక్యం, సహాయ కోశాధికారిగా సమరెడ్డి రామారావుతో 26 మందితో కూడిన కార్యనిర్వాహక సభ్యులు ఎన్నికయ్యారు.

రగ్గులు పంపిణీ

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: వైఎస్ఆర్ సీపీ అరకు నియోజకవర్గ మహిళ నాయకురాలు కమ్మిడి నిర్మల గురువారం మండలంలోని పనస పుట్టు పంచాయతీ టిక్రపడ గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా సానుకూలంగా ఆమె స్పందించారు. అనంతరంలో వితంతువలు, వయోవృద్ధులకు రగ్గులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి నాయకులు వెంకట్, సూర్యనారాయణ, జనం సూరి, మొంగ్ల, గోపి, దుక్కు పాల్గొన్నారు.

సమయానికి హాజరు కాకుంటే జీతాలు నిలుపుదల : కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: సచివాలయం సిబ్బంది సమయానికి హాజరు కాకపోతే జీతాలు కట్ చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుండి ఎంపిడి ఓలు, ఉపాధి హామీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి హామీ పనులు, సచివాలయం సిబ్బంది హాజరు, జనన ధృవీకరణపత్రాల జారీ, ఆధార్ శిబిరాలు నిర్వహణ, ఆస్తిపన్నులు సేకరణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతీ మండలంలోను రోజుకి ఐదు వేల మందికి ఉపాధి పనులు కల్పించాలని సూచించారు. ఉపాధి కూలీల ఆధార్ సీడింగ్, ఆధార్ అథెంటికేషన్ చేయాలని స్పష్టం చేసారు. ఉపాధి పనులు లక్ష్యాలు సాధించని ఎపి ఓల పని మెరుగు పడాలని, పనుల కల్పనలో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించనని హెచ్చరించారు. ఫారం పాండ్స్, కాలువల పనులు గుర్తించి ఉపాధిపనులు చేయాలని పేర్కొన్నారు. తొలగించిన ఉపాధి హామీ కార్డులను పునరుద్ధరించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా పంచాయితీ అధికారి కొండలరావు, డివిజనల్ పంచాయతీ అధికారి పి.ఎస్. కుమార్, డిఎల్‌డిఓ శాంత కుమారి, ఉపాధి హామీ డిబిటి మేనేజర్ నరేష్, ఉపాధిహామీ ఎపిడి జె.గిరిబాబు, జి ఎన్ డబ్ల్యూ ఎస్ జిల్లా కో ఆర్డినేటర్ సునీల్, 22 మండలాల ఎంపిడి ఓలు, ఎపి ఓలు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన రైతుల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి -పాడేరు: గిరిజన రైతులకు వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మంచిని గుర్తించాలని పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలో ఆర్ఓఎఫ్ఆర్, వ్యవసాయ భూమి మంజూరు పత్రం (డి పట్టా)లను గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా 54 మంది గిరిజన రైతులకు 30 ఎకరాల భూమిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పేద రైతులు ఆర్థిక పురోభివృద్ధి సాధించాలన్న ఉద్దేశంతోనే ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు, డీపట్టాల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు, ఎంపీపీ సొనారి రత్నకుమారి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మినుముల సరస్వతి, ఏఎంసీ చైర్మన్ కూతంగి సూరిబాబు, వైస్ ఎంపీపీ కుంతూరు కనకాలమ్మ, మండల పార్టీ అధ్యక్షులు సీదరి రాంబాబు, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్న దొర, ఏఎంసీ సభ్యులు లకే సత్యవతి, డి ఎ ఎ సి సభ్యులు మినుముల కన్నాపాత్రుడు, సర్పంచులు గబ్బాడి చిట్టిబాబు, కుర్రబోయిన సన్నిబాబు, గొల్లూరి నీలకంఠం, మువ్వల మీనా పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి- చింతపల్లి: బడుగు బలహీన వర్గాల కోసం ముఖ్యమంత్రి జగన్ పలు కార్యక్రమాలను చేపడుతున్నారని ఎంపీపీ కోరాబు అనూష దేవి, జడ్పిటిసి పోతురాజు బాలయ్య అన్నారు. కొత్తపాలెం పంచాయతీ సచివాలయం-1లో ఆ పంచాయతీ సర్పంచ్ వనగల సోమరత్నం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ కు జగనన్నే మళ్లీ ఎందుకు ముఖ్యమంత్రి కావాలి అనే కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు మోరి రవితో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రానున్న నెలలలో సామాజిక పింఛను 3 వేలు పెంచి వారికి ఆర్థిక అండగా నిలవనున్నారని అన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి 470 ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువ చేశారన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శారద, ఎంపీటీసీ రాజులమ్మ, వైకాపా సీనియర్ నాయకులు బెన్ని బాబు, రాంబాబు, ప్రభాకర్, బుజ్జి, కార్తీక్రావు, గణేష్, చిరంజీవి, సచివాలయ కన్వీనర్లు, గహశారదులు, పాల్గొన్నారు.

నేడు స్పందన రద్దు

ప్రజాశక్తి-పాడేరు: ఈ నెల 24 వ తేదీ శుక్రవారం పరిపాలనా కారణాలతో స్పందన ప్రత్యేక కార్యక్రమం రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయం గమనించి స్పందనకు హాజరు కారాదని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత

సీలేరులో బ్రోచర్ల ఆవిష్కరణలో వైసిపి శ్రేణులు

ప్రజాశక్తి-సీలేరు : వైసిపి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ పాలన సాగిస్తుందని జీకే వీధి ఎంపీపీ బోయిని కుమారి పేర్కొన్నారు. జీకే వీధి మండలం దామనాపల్లి పంచాయతీ సచివాలయ కేంద్రంలో పల్లెకు పోదాం అనే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న 2024 ఎన్నికల్లో మళ్లీ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. అనంతరం వైసిపి జెండాను ఆవిష్కరించి జగనన్నే మా నమ్మకం కరపత్రాలను ప్రదర్శించారు. దామనపల్లి సర్పంచ్ కుంజేటి రామకృష్ణ, వైసిపి మండల అధ్యక్షులు బొబ్బిలి లక్ష్మణ్, పెదవలస సర్పంచ్ కృష్ణవంశీ, ఆంజనేయులు, బోయిన వెంకటరమణ, మోహన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు : మండలంలోని మారుమూల ప్రాంతమైన ఎం.భీమవరం పంచాయతీలో గురువారం ఎపికి జగన్ ఎందుకు రావాలి, పల్లెకు పోదాం అనే కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి బడుగు రమేష్, పార్టీ మండల అధ్యక్షులు జల్లి బాబులు, నాయకులు సుధాకర్, గాడి సత్యనారాయణ, యు.చీడిపాలెం సర్పంచ్ రమేష్, ఎం.భీమవరం సర్పంచ్ పాటి శేఖర్, తంగుల సువర్ణ, ఉపసర్పంచ్, గొల్లోరి ముక్త, కొండ్ల రుక్మిణీ, బండర దొన్ను దొర, కిముడు సహదేవ్, పల్లాల గణపతి రెడ్డి, జర్తా రాజుబాబు, గేల సోమరాజు, పాంగి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



కొయ్యూరులో మాట్లాడుతున్న ఎంపిపి రమేష్

ఎండోస్కోపిక్ సర్జరీపై జిమ్‌సర్‌లో శిక్షణ

శిక్షణలో వివరిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్‌సర్) వైద్య కళాశాలలోని స్కిల్ ల్యాబ్ ఆధ్వర్యంలో 'ఎండోట్రైనర్' పేరిట ఎండోస్కోపిక్ శస్త్రచికిత్స విధానాలపై గురువారం నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిమ్‌సర్ ప్రో వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ బి.గీతాంజలి హజరై దిశానిర్దేశం చేశారు. వైద్యరంగంలో వస్తున్న సాంకేతిక మార్పులపై అవగాహన పెరగడానికి ఈ తరహ శిక్షణ దోహదపడుతుందన్నారు. జిమ్‌సర్ డీన్ డాక్టర్ ఎస్.పి.రావు వైద్య కళాశాలలోని నైపుణ్య శిక్షణ కేంద్రం ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. వివిధ వైద్య కళాశాలల నుంచి జూనియర్ రెసిడెంట్ వైద్యులు, శస్త్రచికిత్సను బోధించే వైద్య నిపుణులు పాల్గొన్నారు.

డిఎస్‌సి నోటిఫికేషన్‌ను ప్రకటించాలి

ప్రజాశక్తి- మాధవధార : నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న డిఎస్‌సిని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఎపుడు ప్రకటిస్తారో చెప్పాలని ఎపి స్టేట్ కాంగ్రెస్ ఒబిసి చైర్మన్ మూల వెంకటరావు ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి 52 వేల ఉపాధ్యాయ పోస్టులతో మెగా డిఎస్‌సి నిర్వహించారరాష్ట్ర విభజన తరువాత గత ప్రభుత్వం 2018లో 7వేల ఉపాధ్యాయ పోస్టులతో డిఎస్‌సి నిర్వహించిందన్నారు. గడిచన ఏడేళ్లుగా డిఎస్‌సి నోటిఫికేషన్ కోసం నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారన్నారు బిఇడి, డిఇడి ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకున్న నిరుద్యోగ అభ్యర్థులు దాదాపు ఐదు లక్షలమంది రాష్ట్రంలో ఉన్నారని, వీరిలో మూడు లక్షలమంది టెట్ అర్హత పరీక్ష పాసయ్యారన్నారు. ఏటా జనవరిలో ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేస్తామని ప్రకటించిన వైసిపి, డిఎస్‌సి నోటిఫికేషన్‌ను ఎపుడు విడుదల చేస్తుందాయని వీరంతా ఆశగా ఎదురు చూస్తున్నారన్నారు. ఉపాధ్యాయ పోస్టులను భర్తీతో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన,విద్యను అందించే చర్యలు చేపట్టాలపాకపనేజ కోరారు.

వైసిపి పాలనలో ఏజెన్సీ అభివృద్ధి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : వైసిపి ప్రభుత్వంలోనే ఏజెన్సీ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందిందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ అన్నారు. మండలంలోని లోదొడ్డి పంచాయతీ పరిధి లోదొడ్డి నుండి పాకివెలితి వరకు బిటి రహదారి పనులను గురువారం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ప్రారంభించారు. అనంతరం లోదొడ్డి గ్రామంలో విషపూరిత కళ్ళు తాగి మృతి చెందిన వారి కుటుంబాలకు చెక్కులు అందజేశారు. అనంతరం వాతంగిలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాల భవనాలను ప్రారంభించారు. ఎమ్మెల్యే నాగలపల్లి ధనలక్ష్మి పుట్టినరోజు సందర్భంగా సచివాలయ ఉద్యోగులు తదితరులు కేక్ కట్ చేశారు. వాతంగి సచివాలయం పరిధిలోని గ్రామాల్లో సొసైటీ అధ్యక్షులు సింగిరెడ్డి రామకృష్ణ ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఇంటికి వెళ్లి వైసిపి ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, సర్పంచుల సమైక్య అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ, వైస్ ఎంపీపీ రాజేశ్వరి, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వైసిపి నాయకులు

కండువాలు వేసి టిడిపిలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరి

ప్రజాశక్తి -రంపచోడవరం

మండలంలోని పోక్స్‌పేట గ్రామపంచాయతీకి చెందిన వైసిపి నాయకులు మడకం బుజ్జి దొర, పండ కృష్ణమూర్తి గురువారం టిడిపి మండల అధ్యక్షులు కారం సురేష్ బాబు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి టిడిపి మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా గ్రామంలో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సారపు జోగిదొర, కారం సింహాచలం, కొంచెం బాపనదొర, కారం రాజగోపాల్, గొర్లె సునీత, సూర్యనారాయణ రాజు, పోచమ్మ,

వైసిపి పాలనలో కుంటుపడిన అభివృద్ధి

బాబు ష్యూరిటీ పత్రాలను ఇస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి -కొయ్యూరు : నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని టిడిపి ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొర్రు రామ్మూర్తి, టీఎన్ఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు సన్యాసిరావు అన్నారు. మండలంలోని ఎం.మాకవరం గ్రామంలో బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం తిరిగి అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు.

అటవీ కలప స్వాధీనం

ప్రజాశక్తి-కొయ్యూరు : అక్రమంగా ఆటోలో రవాణా చేస్తున్న అటవీ కలపను మండలంలోని కాకరపాడు గ్రామ సమీపంలో గురువారం పట్టుకున్నట్లు ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ సింహాద్రి, కాకరపాడు బీట్ ఆఫీసర్ రాజ్ కుమార్, మంప బీట్ ఆఫీసర్ రాకేష్ కుమార్ తెలిపారు. ముందస్తు సమాచారంతో గురువారం మాటు వేసి, ఆటోలో తరలిస్తున్న ఎనిమిది గనర ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. వాటి విలువ రూ.18,780 ఉంటుందన్నారు. ఈ మేరకు ఆటోతో పాటు పట్టుబడిన కలపను సీజ్ చేసి కాకరపాడులోని అటవీశాఖ కార్యాలయానికి తరలించినట్లు చెప్పారు. అటవీ కలప అక్రమ రవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.